డా. రావూరి భరద్వాజ సాహిత్యం 2



అట్టడుగున అవతరించి, ఆకాశపుటంచులదాకా ఎదిగిన కొందరి తీరుతెన్నులు

# కాదంబరి

నవల

అట్టడుగున అవతరించి, ఆకాశపుటంచులదాకా ఎదిగిన
కొందరి తీరుతెన్నులు

# కాదంబరి

నవల


**డా. రావూరి భరద్వాజ**

# అక్షరార్చన

''సుఖపడే సంసారాలన్నీ ఒక్కలాగే ఉంటాయి. కష్టపడే సంసారాల్లో వేటిదోవ వాటిదే!'' అంటాడు టాల్‌స్టాయ్, 'అన్నా కెరినీనా' నవలను ప్రారంభిస్తూ. ఈ ప్రత్యక్షరసత్యం, సంసారాలకే గాదు: వ్యక్తులక్కూడా అన్వయిస్తుంది.

మంటి నుండి మింటి కెగసినవారి సంఖ్య ఎప్పుడూ పరిమితమే. ప్రపంచంలోని ఆరవవంతు భూభాగంలో సామ్యవాద వ్యవస్థను నెలకొల్పిన లెనిన్; 'నేను జయించడానికి, ఈ భూమండలం మీద కొద్దిదేశాలే వున్నాయి' అని విచారించిన నెపోలియన్; సంచార జాతులను కూడగట్టి, బలీయమైన ప్రభుత్వాలను గజగజలాడించిన చెంఘిజ్‌ఖాన్; రైతుబిడ్డగా పుట్టి, కార్ల సామ్రాజ్యాధిపతిగా కన్నుమూసిన హెన్రీఫోర్డ్; కష్టాలను, కన్నీటిని ఆరగించి, మహానటుడుగా ప్రపంచ ప్రజల జేజేలందుకొన్న చార్లీచాప్లిన్; ఎండిపోయిన రొట్టెను ఆకలికి అడ్డంపెట్టి, ఆచంద్రార్కం నిలిచిపోయే వ్యంగ్య చిత్రాలను తీసిన వాల్ట్‌డిస్నీ; ఇంకా క్రిజ్లర్, కార్వర్, డన్‌లప్, గుడియర్, విశ్వేశ్వరయ్య మొదలైనవారు ఏ దేశంలోనైనా, ఏకాలంలోనైనా కొద్దిమందే ఉంటారు.

''శూన్యం నుండి సృష్టి' అన్న నానుడికి, వీరందరూ ప్రతీకలు. ఉన్నతాశయం, మొక్కవోని కార్యదీక్ష, చెక్కుచెదరని పట్టుదల-ఇవి మాత్రమే పెట్టుబడులుగా వారు తామనుకొన్న వాటిని సాధించారు. అడుగడుగునా ఎదురయ్యే కష్టనష్టాలు; ఝుమ్మని ముసురుకొని, ఉక్కిరిబిక్కిరి చేసే నిరాశా నిస్పృహలు, వృత్తిరీత్యా ఎదురయ్యే తీవ్రమైన పోటీలు;సాటివారి ఈర్ష్యాద్వేషాలు; అడుగుతీసి మరో అడుగు వేయడానికి వీలుపడని కుట్రలు, కుతంత్రాలు; యివేవీ వీరిని చలింపచేయలేకపోయాయి. అన్నింటినీ ఓర్పుతో, నేర్పుతో అధిగమించి, తారస్థాయినందుకొన్నారు.

ఈ నవలలోని రామకృష్ణయ్య కూడా ఈ కోవకు చెందినవాడే: గర్భదారిద్ర్యంలో జన్మించి, కోటికి పడగలెత్తాడు. దొరికిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొన్నాడు. అవసరమనుకొన్నప్పుడు, అవకాశాలను తనకు తానుగా సృష్టించుకొన్నాడు. దారిద్ర్యమూ  దాని ఫలితాలూ,రామకృష్ణయ్య జీవితాన్ని తీర్చిదిద్దాయి. సామాజిక పరిస్థితులు ఉప్పెనగా విరుచుకుపడి, అతన్ని కకావికలు చేసినప్పుడు, ఆ మహావిధ్వంసం నుండే ఆయన కొత్త జీవితానికి కావలసిన ప్రాణశక్తులను సేకరించుకొన్నాడు.

మిత్రులు అక్కినేని నాగేశ్వరరావుగారు కూడా సరిగ్గా ఈ కోవకే చెందుతారని నాకు తెలుసు. కృష్ణాజిల్లాలోని ఓ మారుమూల పల్లెసీమలో, చదువు సంధ్యలకు అట్టే అవకాశం లేని, సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన అక్కినేని, అనితర సాధ్యమైన విజయాలను తన రంగంలో సాధించారు. ఈ మహాప్రస్థానంలో ఆయనను ఝంఝామారుత్తులు, విషాగ్నులు చుట్టుకొన్నాయి. అగాధాలు, అపజయాలు ఎదురయ్యాయి. నమ్మి కాలూనిన నేల, కోతపడి దొలుచుకుపోయిన సందర్భాలూ ఉన్నాయి.  అన్నింటి నుండి జీవశక్తిని పుంజుకొని, ద్విగుణీకృత వేగంతో, లక్ష్యం వైపు సాగాడు. లక్ష్యాన్ని చేరుకొన్నాడని, మనమనుకొన్నా- అక్కినేని అలా అనుకోవడం లేదు. తాను సాధించినదానితో తృప్తిపడక, క్లిష్టమైన లక్ష్యాలను తనకు తానుగా మరిన్నింటిని నిర్ణయించుకొని, వాటి ఫలసిద్ధికోసం, నిరంతరం పాటుపడుతున్న నిత్యకృషికుడు అక్కినేని.

''భగవంతుడు-మీ అందరికీ ఉపకరించే నూతనాంశాలు కొన్నింటిని, నా ద్వారా

ఆవిష్కరింపచేయటం, నా అదృష్టం''అని జార్జ్‌వాషింగ్‌టన్ కార్వర్, న్యూయార్క్ మహానగరంలో అన్నప్పుడు, అతని వినయానికి అమెరికన్ ప్రజ విస్తుపోయింది. మిత్రులు అక్కినేని సాధించిన విజయాలూ తక్కువైనమేమీ కాదు. ఐనా, ఆయన తన వినయాన్నీ, వినమ్రతనూ పోగొట్టుకోలేదు. అలా పోగొట్టుకోని అక్కినేని వ్యక్తిత్వానికి ఈ 'కాదంబరి' ఒక ఉపద:

''కాంతాలయం'' -రావూరి భరద్వాజ

హైదరాబాదు-500057

5-7-1978

# కృతజ్ఞతలు

ఎప్పుడో రాయవలసిన పుస్తకమిది. అనివార్యంగా ఆలస్యమయిపోయింది. ఇంకా ఆలస్యమయ్యేదే-మా మంచాళ జగన్నాథరావుగారూ, వాడ్రేవుపురుషోత్తంగారూ పట్టుపట్టకపోతే....

బాణ మహాకవి రచించిన 'కాదంబరి' సంస్కృతంలో వెలసిన తొలి వచన కథాకావ్యం. ఈ మాటకు నానార్థాలూ ఉన్నాయి-ఒకానొక 'కావ్యవిశేషం, ఆడుకోయిల, గోరువంక, మద్యం, నవల మొదలైనవి'. మీ నవల వచనకావ్యంలాగా ఉన్నది. ఇందులోని ప్రతి పాత్రా ఒక్కోరకమైన మాదకతతో జోగిసలాడిపోతూ ఉన్నది. పుస్తకానికి 'కాదంబరి' అన్న శీర్షిక నుంచండి అని సలహా ఇచ్చినవారు డాక్టర్ రాఘవాచార్యగారు-

వీరందరకు.....

-రచయిత

# ఉపద
# శ్రీఅక్కినేని నాగేశ్వరరావు గారికి...

**కాదంబరి నవల 1978లో తొలిసారిగా వెలువడినపుడు, ఆ నవలను గురించి ఎందరో పాఠకులు, రచయితలు, విమర్శకులు తమ అభిప్రాయాలను తెలియచేశారు; లేఖల రూపంలోనూ, వ్యాసాలరూపంలోనూ, వాటిల్లోంచి శ్రీడి. రామలింగంగారి అభిప్రాయాన్ని ఈ రెండవ ముద్రణలో పొందుపరుస్తున్నాం.**

# తెలుగు పలుకుబడి సహస్ర ముఖాలుగా దర్శనమిచ్చే
# ఉత్తమ నవల కాదంబరి

మిత్రులు రావూరి భరద్వాజగారికి

మీరు ఆదరంతో ఇచ్చిన "కాదంబరి"నవల ఇవాళే చదివాను.

దీనికి "కాదంబరి"అనే పేరు ఎందుకు పెట్టారా? అని కొంతా ఆలోచించాను. సంస్కృతంలోని "కాదంబరి" (ఔట్ అండ్ ఔట్ ప్రోజ్ రొమాన్స్. దాని కథ "పంచతంత్రం"లో ఎన్నో డొంకతిరుగుళ్ళు ఉన్న కథ. కథలో ఎన్నో ఉపకథలు, ఉపాఖ్యానాలు: ఐతే "కాదంబరి"లో లాగే మీ నవలలో కూడా కొంత రొమాన్సు ఉండి అందులోవలెనే ఇందులోనూ ప్రపంచ సరళిని సూచించే వ్యాఖ్యలూ, రిమార్కులూ వున్నాయి. ప్రతిపేజీలో వున్నాయి. దానిలో వలెనే దీనిలో కూడా అడవులూ, నదులూ, తదితర ప్రదేశాల వర్ణనలూ కడు సహజంగా అపారంగా వున్నాయి.

ఈ నవలలో రచయితకు గల అపారమయిన లోకజ్ఞానం,సమకాలిక సమాజంలో ముఖ్యంగా ఆర్థిక రాజకీయ రంగాలలోని వ్యవహారాలు, మతలబులు, ఎలా నడుస్తూ వుంటాయో, వాటికి సంబంధించిన పరిజ్ఞానం, ఎంత బహుముఖంగా దర్శనమిస్తుందని: ముఖ్యంగా రామకృష్ణయ్య పాత్ర సృష్ఠి, పోషణ ఒక గొప్ప ప్రతిభకు తార్కాణం. మొదట రామకృష్ణయ్య ఆర్థికరంగంలో ఎలా ఆగర్భ దారిద్ర్యం నుంచి శ్రీనాథుడు ఎలా అయిందీ చూపారు. తరువాత రాజకీయ రంగంలో ఎట్లా వ్యవహార దక్షుడయిందీ అనన్యంగా చిత్రించారు. ఈరెండు రంగాలలోనూ అతను ఔన్నత్యాలనందుకున్న వైనాన్ని ప్రాసెస్‌ను మీ ప్రజ్ఞతో రచించారని చెప్పాలి. ఆటుపోటులను తట్టుకొని, జీవితమనే పద్మవ్యూహంలో నుంచి నడచిపోవడానికి సాహసించి, విజయం పొందినవాడు గొప్ప వ్యక్తి క్రిందే లెక్క. పైగా రామకృష్ణయ్య పాత్రలో కొన్ని గొప్ప విశేషాలు కూడా వున్నాయి. అతనిలో మానవత్వం తాలుకు మంచితనం వుంది. తాను వ్యాపారం చేసినా రైతులను మోసం చేయలేదు. వారికి న్యాయంగా చెందవలసిదాన్ని వారికిచ్చాడు. ప్రాజెక్టుకోసం అతను చేసిన కృషి కూడా రైతుల మేలుకొరకే: అతనికి అందులో రవంతైనా స్వార్థం లేదు. జీవితాన్ని బాగా అర్థం చేసుకున్నాడు విజయం సాధించిన తర్వాత జీవితాన్ని బాగా అనుభవించాడు. అలా అనుభవించే స్వాతంత్ర్యం, అవకాశాలు తన సంతానానికి కూడా ఇచ్చాడు. జీవితంలో ఎంత ప్రాక్టికల్ మనిషో అంత త్యాగం చేసినవాడు. ఈ ప్రపంచంలో ఎంత దగా, వంచన అవినీతి, స్వార్థపరత్వం, కల్మషం ఉన్నప్పటికీ వ్యక్తి సినిక్ కానక్కరలేదు. పెసిమిస్ట్ అంతకన్నా కానక్కరలేదు. మనుషులను ద్వేషించనక్కరలేదు. సమాజాన్ని దూషించుకుంటూ కూర్చోనక్కరలేదు. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగిపోయి విజయాన్ని ఫుల్‌ఫిల్‌మెంట్‌నూ సాధించడమే మానవుడు చేయవలసిన పని. ఐతే ఆ మహాప్రస్థానంలో సాటి మానవునికి, అందులోనూ కృషికునికి అన్యాయం చేయవలసిన పనిలేదు. వారికి కొంత చేయూతనిస్తూ మానవుడు స్వీయశ్రేయస్సుకోసం పాటుపడవచ్చు. ఎన్నో ఘనవిజయాలు సాధించవచ్చు-అని మీరు ఈ నవల ద్వారా, ప్రత్యేకంగా రామకృష్ణయ్య పాత్ర ద్వారా చెప్పారు. ఆ రీత్యా దీనికొక విశేష రచనగా పరిగణించడానికి నేను సందేహించను. నిస్సందేహంగా ఇది గొప్ప నవల. ఎందుకంటే ఎంతో కల్మషం వున్న సమకాలిక సమాజంలో నుంచి ఒక వ్యక్తిని ఎంత గొప్పగా నడిపించుకుపోయారు:

అతను "అవినీతి"అనబడే పనులు చేసి ఉండవచ్చుగాక. కాని ఎలా నడచుకుంటూ వెళ్ళి శిఖరాలనందుకున్నాడన్నది ముఖ్యాంశం. వ్యక్తిలో, సమాజంలో మంచీ-చెడూ రెండూ వుంటాయి. కాని మానవత్వానికి కావలసింది సార్థకత, వ్యక్తి తన చేష్టల ద్వారా కొన్ని విలువల్ని పరిపోషించడము. ఆ విలువలు ఈ నవలలో ప్రస్ఫుటంగా వున్నాయి.

అలాగే కౌముది పాత్ర సృష్టి, పోషణ, ఆఖరుకి ఆ అమ్మాయి తన తాలూకు నిజాన్ని గ్రహించి, కన్నీరు కార్చి, నిర్మలమైన చిరునవ్వు ప్రదర్శించి ఆత్మీయమైన వ్యక్తిత్వపు తాలూకు సత్యాన్ని, ఆ వ్యక్తిత్వంలోని బలహీనతల్నీ గుర్తించగలగడం విశేషమే. చాలా విచిత్రమైన స్త్రీ. పురుషుడి సాహసం, తెగువ వున్న స్త్రీ. కాని స్త్రీత్వం సంపూర్ణంగా వున్న స్త్రీ. ఇదొక అపూర్వ సృష్టి. ఏమి మనస్తత్వం: ఎటువంటి సుపీరియారిటీ కాంప్లెక్స్‌లో నుంచి ఆత్మజ్ఞానం కలగడంతో ఎంతటి పునీతురాలవుతుంది. రబ్బరు బొమ్మలాంటి మొగుడితో కాపురం చేయడంలో వున్న అమానుషత్వాన్ని గ్రహించగలిగిందంటే ఆమె ఎక్కడి నుంచి ఎక్కడికి ప్రయాణించిందో పరిశీలకులు గ్రహించవచ్చు. ఆ స్త్రీ చివరకు నాకు కావలసింది మానవాతీతుడైన మొగుడు కాదు. అతను చాలా సగటువారీ మనిషయి వుండాలి. అతనికోపం, చిరాకు, ఈర్ష్య, ద్వేషం, విసుగు, అసూయ, అనుమానం ఇలాంటి లక్షణాలన్నీ ఉండాలి. అప్పుడప్పుడు తిట్టాలి. ఆ తిట్లు పడలేక నేను ఎదురుతిరగాలి. అలా ఎదురుతిరిగినందుకు ఆయన చేయి చేసుకోవాలి. చేయి చేసుకున్నందుకు నేను ఏడ్వాలి. ఆయన ఓదార్చాలి. ఏవీ? వీటిల్లో ఏ వొక్క ముచ్చటా నాకు తీరేటట్టు లేదు అని అన్న కౌముది నిజంగా సంపూర్ణ స్త్రీత్వం గల జీవి. ఈ పాత్రలోని విషాదం నాకు విశ్వవిఖ్యాత నవలా రచయిత రోమారోలా రచించిన "జీన్ క్రిస్టోఫ్" నవలలోని స్త్రీ పాత్రలను స్ఫురింపచేసింది. అలాగని ఈ పాత్రకూ, ఆ పాత్రలకూ వ్యక్తిత్వాలలో పోలికలు వున్నాయని నేను చెప్పదలచలేదు. పోలికలు లేవు. పోలిక వున్నదల్లా స్త్రీ జీవితంలోని విషాదంలోనే. విషాదానికి తావేలేని పరిస్థితులలో పెరిగిన కౌముదిలో ఇంత విషాదం వుందని చూపించడంలోనే రోమారోలా, భరద్వాజల రచనల్లో వున్న విశేషం. ఏ పురుషుడూ-అతనూ సమగ్ర పురుషుడైతే-కౌముదిని మరిచిపోలేడు. ఆమెకు భర్తగా వుండేవాడు ఆమె అమాయకత్వం పట్ల జాలితో, అనుకంపతో, స్వార్థత్యాగంతో, తన అహాన్ని త్యాగం చేయడంతో వుండవలసిందే. ఆమె గొప్ప వ్యక్తి అనను. ఒక గొప్ప వైఫల్యం. a great failure at what a great model finally: what a wonderful realisation on the part of woman who is a near-wreck.

ఈ నవలలో నిండైన, సమగ్రమైన కథలేనిమాట నిజమే. కాని వ్యక్తిత్వ చిత్రణ సామాజిక చిత్రణ ఎంత గొప్పగా వున్నాయి: you have presented a decadent society in all its vicious aspects. But in such a society, both the father and the daughter are models for excellece. They are real humans.

చివరకు నవల భాషను గూర్చి ఒక్కమాట చెప్పాలి. ఇది నూటికి నూరుపాళ్ళు తెలుగు నవల, తెలుగుపలుకుబడి సహస్రముఖాలుగా దర్శనమిచ్చే నవల. మరొకభాష ఏదీ ఈ నవల భాషను లేశమాత్రమైనా ప్రభావితం చేయకపోవడం ఒక విశేషం. అంతేకాక మొత్తం తెలుగు పలుకుబళ్ళన్నీ చోటుచేసుకున్న సాంఘిక నవల ఇది. నా అభినందనలు.

**- డి. రామలింగం.**

# కాదంబరి

మనం కార్యకారణ సంబంధాలంటూ అలసిపోయేదాకా వాదిస్తూ ఉంటాం. ప్రతిదానికీ ఎక్కడో అక్కడ ఓ కారణమంటూ ఉంటుందని, ముందుగా ఓ నమ్మికను ఏర్పాటు చేసుకొని, ఆ నమ్మకాన్ని నిజం చేయడంకోసం, నానాగొడవలు పడడంలోనే, ఆధునిక జీవితం తాలూకు చిక్కులన్నీ ఉన్నాయని హెన్రీమూర్ అంటారు. కావడానికి అతనూ హేతువాదే: కానీ ఆ హేతువుకు హేతువేమిటని అన్వేషించడంతో అంతా అయోమయంగా గజిబిజిగా తయారయిందంటారు మూర్. హేతువాదం ప్రక్కకు తప్పుకుని, కర్మ సిద్ధాంతానికి తావిచ్చే సందర్భం కూడా యిదేనని మూర్ అంటారు.

సరిగ్గా అలాంటి స్థితిలోనే పడిపోయాడు జగన్నాథం. అప్పుడెప్పుడో, ఏదో పత్రికలో, ఓమూలగా ఓ చిన్న వార్త పడింది. ఓ పశువుల కాపరి గొడ్లను మేపుకొంటూ, అడవిలోకి పోయాడట. దోవ తప్పాడట. తిరిగి అడవి వెలుపలికి రావడానికి బదులుగా, యింకా యింకా అరణ్యగర్భంలోనికి పోయాడట. అక్కడ అతనికో పాడుబడిన భవనం కనిపించిందట. ఈ రాత్రికి అతనక్కడే గడిపి, ఆ మర్నాడే యమచరలు పడి, కొంపకు చేరుకున్నాడట. ఇంతవరకూ అయితే యిందులో "న్యూస్" అంటూ ఏమీలేదనే చెప్పాలి. ఆ రాత్రి, అతనిమీదికి దూకిన ఓ చిరుతపులితో హెూరాహెూరీగా పోరాడి, పిడికిళ్లతో గుద్ది మరీ చంపేశాడు. అదీ "న్యూస్"కు పెట్టిన హెడ్డింగ్. కాని ఆ న్యూస్ఎడిటరెవరో కాస్త టేస్టున్న వాడిలా వున్నాడు. చిరుతపులితో పోట్లాడిన భాగాన్ని ఆఖర్ని యిచ్చి ముందుగా, ఆ పాడుబడిన భవనాన్ని గురించి చెప్పుకొచ్చాడు.

తానైనా అంతవైనంగా ఆ వార్త చదవకపోను. పత్రికవాళ్ళు దాన్ని 'బాక్స్'కట్టి మరీ వేశారు. తనకు చిరుతపులితో పోరాడిన వాడి ధైర్యసాహసాలతో పనిలేదు. ఆరాత్రి అతగాడు తలదాచుకొన్న భవనం-ఆ పాడుపడిన భవనం-దాన్ని గురించిన వివరాలు కావాలి. అసలా వార్త చదువుతుంటే, దాని వెనుక ఎంతో చరిత్ర ఉన్నదనిపిస్తుంది. కాకులు దూరని కారడవుల్లో, అపురూపమైన కట్టడాలు, దేవాలయాలు, శిలాశాసనాలు, నిధినిక్షేపాలు ఉండడం, అపూర్వమేమీ కాదు. కానీ తనకు తెలిసినంతవరకూ ఆ ప్రాంతంలో యిలాంటి కట్టడాలు వున్నట్లు వినలేదు. అంటే యిదేదో కొత్తదయి వుండాలి. దీని అనుపానులన్నీ తెలుసుకుంటే, ఎంతో కొంత చరిత్ర మరుగునపడిన చరిత్ర-వెలికి రావచ్చును.

అసలీ అభిప్రాయంతోనే జగన్నాథం బయలుదేరాడు. ముందుగా పేపరు ఆఫీసుకు వెళ్ళాను. ఆనాటి పేపరు తాలూకు ఒరిజినల్స్ తీయించాడు. ఓ అరఠావు సైజు కాగితం మీద, తను పత్రికలో చదివిన వార్తే. అర్థంకాని గజిబిజి వ్రాతలో ఉన్నది. అది రాసిన సబ్ఎడిటర్ను కాఫీకి కేకేసి, యింకా ఎక్కువ వివరాలు సేకరించడానికి ప్రయత్నించాడు జగన్నాథం. అదేదో పంచాయితీ ఆఫీసు నుండి తనకు వచ్చిందనీ, ఇంటరెస్టింగ్గా ఉంటుందన్న అభిప్రాయంతో దాన్ని వేశాననీ అన్నాడు సబ్ఎడిటర్.

"అంటే" మీ అభిప్రాయం, ఆ భవనం చాలా పురాతన కాలానికి చెందిందనేనా? అన్నాడు జగన్నాథం.

"భవనమా?"అన్నాడు సబ్ఎడిటర్ చిరాకుపడుతూ "ఆ గొడవలేమీ నాకు తెలియవండి.

వార్త వచ్చింది-మనిషి చిరుతపులిని గుద్ది చంపడం అంటే -నా దృష్టిలో మంచివార్తే! అందుకనే బాక్స్ కట్టివేయించాను. మరి భవనం, గివనం అనేవీ నాకు తెలీదు".

"నాకా వివరాలే కావాలే"అన్నాడు జగన్నాథం బతిమిలాడుతున్న ధోరణిలో.

"ఓ పనిచేయండి. నేనీ ఒరిజినల్ వెనుక సోర్స్ కూడా రాసినట్లు గుర్తు. అడ్రసిస్తాను. మీరెళ్ళి ఎంక్వైరీ చేసుకోండి"అన్నాడు సబ్ఎడిటర్.

"అంతవరకే చాల"నుకొన్నాడు జగన్నాథం.

తీరా ఎడ్రస్ రాసుకొన్నాక ఆ ఎడ్రసుకు చేరడాన్ని గురించి వాకబు చేస్తే ఆ గ్రామం అక్కడికి 80మైళ్ల దూరంలో ఉంటుందనీ, అందులో కొంతదూరం రైలుమీదా, 20మైళ్లు బస్సుమీదా పోయాక, ఆఖరు నాలుగు మైళ్ళూ నడచిపోవాలనీ చెప్పారు.

ఈ నాలుగు మైళ్లలోనూ, ఊళ్ళూగీళ్లూ ఉండవట. రోడ్డుకూడా ఉండదట. కాలిబాటన పోవాలట. మధ్యలో మూడు వాగులుంటాయట. బాటకు అటూఇటూ చిట్టడవి ఉంటుందట. అందులో సింహాలు, పెద్దపులులూ ఉండవట గానీ నక్కలు, తోడేళ్ళు, అప్పుడప్పుడు చిరతలూ ఉంటాయట. పాములు మాత్రం ఎక్కువగా ఉంటాయట.

"పగలు ఫర్వాలేదండీ! ఎవరో వొకరు వస్తూపోతూ ఉంటారు. మెకాల భయం తప్పిస్తే దొంగల భయం ఉండదండీ"అన్నారొకాయన.

"అయ్యో! యివన్నీ ఉంటేనే బాగుండునే"అనిపించింది జగన్నాథానికి.

ఎందుకంటే, ఏ అనుభవమూలేని, ఏ ఉద్వేగమూ కలగని, సాదా జీవితమంటే జగన్నాథం భరించలేడు.

తనా అడవిలోంచి పోతున్నప్పుడు ఏదో జరగాలి. అడవి జంతువులు దోవకు అడ్డుగా రావడం, తను భయంతో చెట్టెక్కడం, అక్కడ చెట్లకొమ్మలకు పాములు చుట్టుకొని బుస్సుమనడం, తాను మరో కొమ్మమీదికి గెంతడం-ఇలాంటిదేదో జరగని పక్షంలో తాను అడవిలోకి వెళ్ళడం కేవలమూ వృథా!

"పోనీకోయలుగానీ, చెంచులు గానీ ఉంటారా?" అన్నాడు జగన్నాథం.

"ఉండరు".

"ఎలుగుబంట్లు చెట్లమీద ఉంటాయంటారు గదా! అలాంటివేవీ ఉండవా?" అన్నాడు జగన్నాథం అశగా!

"ఏమీ ఉండవండీ బాబూ! అడవంటే-అది నిజంగా అడవి కాదు, చిట్టడవి. పెద్దపెద్ద చెట్లు కూడా అట్టే వుండవు. అన్నీ రుప్పలు, తిప్పలు, పొదలూ, ముళ్ళడొంకలూ ఉంటాయి. అన్నట్టు నాగజెముడు పొదలున్నాయండోయ్! ఇది నాగజెముడు గుబ్బలకు మంచి సీజను. మీరు తిన్నన్ని ఉంటాయి"అన్నాడతను.

"అసలు అడవంతా యిలానే ఉంటుందా?"అన్నాడు జగన్నాథం.

అవతలి వాడికి మండిపోయింది.

"నాకు తెలీదు. నాకు అడవులతో పనికూడా లేదు"అంటూనే వెళ్ళిపోయాడతను.

జగన్నాథ జేబు తడుముకొన్నాడు. పర్సు బరువుగా ఉంది. తోలుపెట్టె తెరచి చూసుకున్నాడు. నాలుగుజతల గుడ్డలు, దుప్పటి, రివాల్వర్, గుళ్ళు,కాగితాలు, రంగుపెన్సిళ్ళు, టేపు, జిల్లామ్యాపు అన్నీ ఉన్నాయి.

తీరా ఆ వూరు వెళ్ళాక జగన్నాథం చాలా నిరుత్సాహపడ్డాడు. ఊరంటే అదేదో పెద్ద ఊరనుకున్నాడతను. అందులోనూ సబ్‌ఎడిటర్‌గారు, పంచాయితీ, గించాయితీ అంటూ చెప్పుకొచ్చాడు. 'పంచాయితీ ఉన్న ఊరంటే అంతో ఇంతో 'కల్చర్' ఉండకపోతుందా' అనుకొన్నాడు. అంతా కలిపితే నలభై, నలభయ్యయిదు కొంపల కంటే ఎక్కువ ఉండవు. ఊరి ముందు మేకలమంద, బర్రెగొడ్ల గుంపూ కనిపించింది. కాలికి వీరరాఘవులు కడియం, వెండిబిళ్ళల మొలతాడు, కర్రపూసలూ ఉన్న ఆసామీ, రాగోలు కర్ర భుజాన పెట్టుకొని ఊరిముందు కనిపించాడు. తననుగానీ పలకరిస్తాడేమోననుకొన్నాడు జగన్నాథం. అలాంటిదేమీ జరగలేదు. చొంగలోకి పొగాకు దట్టించి, చెకుముకి రాయితో నిప్పుకొట్టుకుని గుప్పుమని పొగలాగుతూ కంప పోగువేస్తున్నాడు. జగన్నాథానికేమీ పాలుపోలేదు. ఓ క్షణం అక్కడే నిలబడి, గొంతు సరిచేసుకుని పలకరించాడు.

"ఏంది?" అన్నాడు ఆసామీ అతనివైపు చూడకుండానే.

"ఈ వూళ్ళో చిరుతపులి చంపిన వీరుడెవడో ఉన్నాట్ట. అతన్ని చూడ్డంకోసం వచ్చాను. అతనిల్లు యెక్కడో చెబుతావా?"

చొంగతీసి, రేలాకులో చుట్టి, దాన్ని తలగుడ్డలో దోపుకొన్నాడతను.

"సిడతను సంపినాడా? సీ రాములుగాడు గందా: అల్లా యాప పక్కగా ఉంటాడు. అసలేందంటా కతా?"అన్నాడతను.

జగన్నాథం "అమ్మయ్య"అనుకొన్నాడు.

"మరేం లేదు బాబూ"అంటూ ఆరంభించాడతను. "చిరుతను చంపిన వారితో మాట్లాడాలి. అందుకోసం పట్నం నుంచి వొచ్చాను. అతను ఊళ్ళో ఉన్నట్టేనా? అతన్ని గురించి నీకు తెలిసినదంతా చెబుతావా?"అన్నాడు జగన్నాథం.

ఆసామీ రాగోలుతో, చిల్లకంపను పక్కకు లాగుతూ, ఊరివేపు ఓసారి చూసి కర్రను తుమ్మపీకెకు ఆనించి, గడ్డం కింద గోక్కున్నాడు.

"వాడి బొందలెండి బాబూ; మెకం మీద బడితే ఓరయినా అట్టనే చేత్తారు. కాత్తె వొయసు ఉన్న నాకొడుకేమో సెయ్యి యిదిల్చే తలికి, ఆ రోగాల మాదిరి వచ్చి ఊరుకొంది. అంతేగాని అసలు సిడతను సంపడం, వాడొంతా, వాడబ్బొంతా?"

తను నేరపరిశోధనకొచ్చినట్టు అతను అనుమానపడుతున్నాడని జగన్నాథం గ్రహించాడు. అసలు తనెందుకొచ్చిందీ చెబుదామని అనుకొన్నాడు. అలా చెప్పడం వల్ల వొరిగేదేమీ ఉండనప్పుడు పారేసుకోవడం వృధా: అయినా, అతన్ని తను మంచి చేసుకోవాలి. తను పోలీసుశాఖకు చెందినవాడు కాదన్న నమ్మకం అతనికి కలిగించాలి.

జగన్నాథం క్షణకాలం ఆలోచించి, ప్రారంభించాడు...

"నేను వ్యాపారం చేస్తాను, తోళ్ళ వ్యాపారము! ఏనుగుల చర్మాలు, పులులు, చిరతలు, సింహాలు, ఎలుగుబంట్లు, పాములతోళ్ళు కొంటాను, అమ్ముతాను. ఈమధ్యనే ఈ ఊరివాళ్ళెవరో చిరతని చంపారని పత్రికల్లో చదివాను. అతగాడు చర్మం అమ్ముతాడేమో కొందామని వచ్చాను"అన్నాడు జగన్నాథం.

ఆసామీ ఇదేమీ నమ్మనట్టుగా కనిపించాడు.

"మరయితే నీ దగ్గర తోళ్ళు లేవేందయ్యా? యాటవాసనన్నా రాదేం?" అన్నాడతను.

జగన్నాథం షాక్ తిన్నట్లయ్యాడు. తను నిజం చెప్పి, కార్యాన్ని సాధించుకోలేడు. అవతలవారికి

నచ్చే అబద్ధాలూ చెప్పలేడు. ఎలాగూ ఒక అబద్ధం ఆడాడు గనుక దాన్నే పట్టుకులాగడం మంచిదనుకొన్నాను.

తనకు పట్నంలో పెద్దషాపు ఉన్నదన్నాడు. కూలీనాలీ జనం అక్కడ పనిచేస్తుంటారన్నాడు. తనేమో పైపైన తిరిగి, మంచి మంచి తోళ్ళు బేరం చేస్తుంటానన్నాడు. ఎప్పుడూ ఊళ్ళమీదనే ఉండడం వల్ల తనకు చర్మాలవాసన అంటలేదన్నాడు. తను చెప్పినదాంట్లో అబద్ధమేమీ లేదని ప్రమాణం కూడా చేశాడు.

"ఏందయ్యా! పెపంచకం బాగా మారిపోయింది. నాసిన్నతనంలో ఇసుమంటియ్యేమీ లేవు. ఆ మద్దెన గొట్టాల లాగులోడు వచ్చాడు. ఏందేందో చెప్పాడు. రోడ్డు ఏపిత్తనన్నాడు. సగం కరుసుపెట్టుకోమన్నడు. డబ్బు దండుకున్నాడు. నాకొడుకు అంతూ ఆనమాలూ లేకుండా పోయాడు. మళ్లీ కనుపియ్యలేదుగానీ-ఊరచెరువులో తొక్కేవోన్ని".

అదీ సంగతి.

అంచాతే జనం యెవర్నీ నమ్మడం లేదు. యెలా నమ్ముతారు? ఏదేదో చేస్తామంటూ రావడం, డబ్బూ, వోట్లూ గుంజుకోవడం-పత్తా లేకుండా పోవడం. మళ్ళీ ఏ ఐదేళ్ళకో గాని వాడు రాడు. అప్పుడైనా వస్తాడన్న నమ్మకం లేదు. ఇంకో కొత్తముఖం వస్తుంది. రోడ్డు వేయిస్తానంటుంది. కరెంటు దీపాలు వెలిగిస్తానంటుంది; అప్పులిప్పిస్తానంటుంది, స్కూలు పెట్టిస్తానంటుంది, పల్లెటూరు స్వర్గం చేయిస్తానంటుంది, ఓట్లు గుంజుకొంటుంది. మాయమైపోతుంది. ఈ దఫా మరో ముఖం ప్రత్యక్షమవుతుంది. ఇల్లాగ ఒకసారి రెండుసార్లు, మూడుసార్లు, పదిసార్లు జరుగుతుంది. ఈ అబద్ధాలు వినీవినీ జనం విసుగెత్తిపోతారు. చివరికెపుడో నిజం చెప్పేవాడొస్తాడు. వాడూ అబద్ధాలకోరేనను కొంటారు జనం. వాణ్ణి పట్టుకొని తంతారు, చీలుస్తారు, పాతేస్తారు!

జంగిలిగొడ్లు దుమ్మురేపుకొంటూ డొంకనబడి అడవిలోకి పోతున్నాయి. మేకల మందలు, ఆకుల్ని కొరుక్కుంటూ ముందుకు సాగుతున్నాయి. దూరాన్నించి గిలకలచప్పుడు వినిపిస్తున్నది. బుడ్డోళ్ళు కొంతమంది, అడ్డగోచీలు పెట్టుకొని, పడ్డలమీద సవారి చేస్తూ బూతు పాటలు పాడుతున్నారు.

"ఓరె నిజమ్మదియ్యా! యింటికాడే ఉండరోయ్"అన్న పొలికేక వినిపించింది.

జగన్నాథం ఆ కేక వినిపించిన వేపుకు చూశాడు. ఓ నల్లటావిడ, మోకాళ్ళదాకా ఆకుపచ్చ చీరను ఎగదోపుకుని, నెత్తిమీద దుత్తపెట్టుకుని ఇటువేపుగా వొస్తున్నది. ఆవిడకు రవికలేదు. పమిట వెనకాల స్తనాలు వదులుగా కదులుతున్నాయి. సత్తుకడియాలు, అందెలు, నీలంరాయి బులాకీ, రాగిగోట్లు, పులిచేరు నాను, అడ్డిగలు, దండకడియం, మొల్లో మురికిసంచి, నోట్లో చుట్ట కుడిచేతిలో బుర్రకా, దాన్నిండా నీళ్లు.....

"అసేయ్, యంకావ్"అన్నాడు ఆసామీ.

"సాల్లేవయ్యా సంబడం! నీ పెల్లాన్ననుకొన్నావెట్టా? 'అసేయ్, వొసేయ్' అంటావేందీ?"అన్నదావిడ నవ్వుతూనే.

"భగవంతుడా! వీళ్ళిప్పుడు తన్నుకోరు గదా:"అనుకొన్నాడు జగన్నాథం.

ఆసామీ తలగుడ్డను విప్పి, భుజాన వేసుకొన్నాడు. చిల్లమండను రాగోలుతో ఎత్తి, తొడుగుమీద వేశాడు.

"అదిగాదే నీయవ్వ లంజకానా! రాతిరేందే ఆ అరుపులు? రాముడుగాడు కాత్తెంత

ఏసుకొచ్చాడా ఏందే?''అన్నాడు ఆసామీ, ''వేసుకోవడం''అన్న దగ్గర చేత్తో అభినయం చేస్తూ.

''జలమకు సిగ్గా శరమా?''అని తుభుక్కున ఊసిందావిడ, ''సచ్చినోడు, సెడతాగాడు. నామీద కవరబడ్డాడు. గుంజాడు, లాగాడు, తొంగోమంటాడు''.

''ఐతే...మరి!''అని నవ్వాడతను.

''జిమ్మకుతెక్కి మాట్లాడవాక! మాఅప్పతోచెప్పి నరికిత్తానయ్యోయ్ మావా''అన్నదావిడ నవ్వి. ''ఆపాట్న...ఏం జరిగిందటే-నేను రోటికాడకొచ్చా. ఎంటబడ్డాడు తోశా. గుంజమీద పడ్డాడు. ముడి గీసకపోయింది. అరిశాడు.అయినా ఏంపనది మావా సచ్చినోడికి?''

తనక్కడున్నట్లు గమనించడం లేదనుకొన్నాడు జగన్నాథం. ఈ సరసాల మధ్యపడి అసలు విషయం కాస్తా నలిగిపోతున్నదన్నుకొన్నాడు.

''ఇంటికాడున్నాడా?''

''ఆ సచ్చాడు. వొల్లంతా, పింజెం, పింజమంటూ పీకుతాఉన్నదంటున్నాడు. కుంటకాడ పొలం పొమ్మని తరిమాడు''.

''అణ్నే బాగుంటది లేవే యంకావ్! సుట్టుపక్కల జనం కూడా ఉండరు'' అన్నాడు ఆసామీ.

నవ్విందావిడ.

నవ్వుతున్నప్పుడు వెండిబిళ్ళల వరసలాగా పళ్ళన్నీ మెరిశాయి. చుట్టుకొసకొరికి తుభుక్కుమని వూసిందావిడ.

''గుడిసెలో ఉన్నాడు. తొందరగా పొలానికి సావమను''

ఆవిడ వెళ్ళిపోయింది.

ఆసామీ వెంట జగన్నాథం గుడిశ దగ్గర కొచ్చాడు. పందిరి కింద కూచుని ఒకాయన పలుపు పేనుతున్నాడు. వీళ్ళను చూస్తూనే లేచి నిలబడ్డాడు. నులకమంచం వాల్చాడు. బానలోంచి సత్తు గ్లాసుతో నీళ్ళు ముంచి, వాళ్ళ దగ్గరగా పెట్టాడు.

''ఈనగారు నీ కోసం వచ్చార్రా'' అన్నాడు అసామీ. ''ఆ నడుమ నువ్వు సిడతను సంపావుగందా! ఆశరమం కొందామని వచ్చాడంట. అదేందో సూసుకోరా!'' అని రెండు వాక్యాల్లో విషయాన్ని తేల్చేశాడు.

అవతల చిరాగ్గా కదిలాడు.

''అదికాదురా ముదనష్టపు నాయాల! నీకేం రోగంరా? రాతిరి దాన్ని నానా గొడవ సేశావంటగందా! ఆడముండ లబోమని ఏడిసిందాయె! నీకది జయం కాదురా'' అని కోప్పడ్డాడు ఆసామీ.

దానికి సీరాములు ఏదో చెప్పుకొచ్చాడు. మొదట్లో విసుగనిపించినా, తరువాత ఆసక్తిగా విన్నాడతను. ఇంకా యింకా చెబుతే బాగుండుననీ అనుకొన్నాడు.

యంకావ్ గొడవ చెయ్యడానికి కారణాలు చెప్పుకొచ్చాడు సీరాములు. తను తాగడం వల్ల తిక్కెక్కి ఆ పని చేయలేదన్నాడు. అసలు తను చెడామడా తాగటానికి కూడా యంకావే కారణమన్నాడు.

''మరదేమో అంకెకు రాకపోయే నన్నేం జావమంటావే? నువ్వే జెప్పు'' అన్నాడు రాములు. సీరాములుకు చాలాకాలందాకా తెలియకుండా ఉన్న సంగతి ఐదారు మాసాల కిందట తెలిసింది. అప్పట్నించీ ఆ కొంపలో రవరవలు బయల్దేరాయి. ఒకసారి సీరాములు గొడ్లను మేపుతూ మేపుతూ పొలం దగ్గరికి పోయాడు. జొన్నచేను పాలుపోసుకుంటూ ఉంది. పరిగపిట్టలు తుగిడీలు తుగిడీలుగా

వచ్చిపడుతున్నాయి. పరిగ పిట్టవాలిందంటే, పంట నాశనమయ్యిందన్నమాటే! సుంకంతా రాలిపోతుందాయె. ఇక మిగిలేదేమిటి, తాలుతప్పా మినహా? జొన్నతో పాటు, పెసరా, దోసా కలిపి వేశాడు. చేనంతా అడవిలా అల్లుకుపోయింది దోస. అంతంత మాత్రపు గొడ్డు చేలో పడిందంటే ఇవతలికి రావడం దాని తరం కాదు.

సీరాములు గొడ్ల కాడికి పోయాడంటే, యంకావ చేను కాపలాకి పోవాలి. అసలు సీరాములు కాపలా ఉంటానన్నాడు. యంకావ వొప్పుకోలేదు. తనకు గొడ్లు మళ్ళవన్నది. పుల్లావు కుమ్ముతుందన్నది. అడవి పందులు, తోడేళ్ళు పడ్డలమీద పడతాయన్నది. భయమన్నది. దోవతెలియదన్నది.

“ఇదంతా నిజమనుకున్నానే” అన్నాడు సీరాములు నీరసంగా.

“ఏందబ్బా! డబ్బాసప్పుడు ఇనిపియ్యటంలేదు అనుకొన్నా. కాని అప్పుడప్పుడు యినపడుతూనే ఉంది” అన్నాడు సీరాములు మెల్లగా.

డబ్బా మోత వినపడుతున్నది గనక యంకావ కాపలాస్తున్నట్లే లెక్క మరి. గొడ్లను నరిసిగాణ్ణి చూడమని సీరాములు పొలం దగ్గర కొచ్చాడు. వస్తూ వస్తూ నాగజెముడు గుబ్బలు, సందెడు విరుచుకొచ్చాడు. బాగా పండినగుబ్బలు, ముళ్ళన్నీ బండకేసి రుద్ది విరిచేశాడు. ఇక చేయవలసిందల్లా మొదట్లో విరిచి, గుజ్జును తినేయడం! యంకావకు నాగజెముడు గుబ్బలంటే మాలావు యిష్టం. ఏం తెచ్చినా, ఏం తీసుకురాకపోయినా సందేళకు నాలుగైదు గుత్తులు, కీసర తీగతో మెలిచి తీసుకొస్తుండేవాడు.

“ఆ రోజునా నే నట్టాగే చేశా” అన్నాడు సీరాములు.

వాడి కళ్ళు ఎర్రబడ్డాయి. కాలికింది నారతడపతీసి పందిరిగుంజ మీద పడేశాడు. లేగ ముందు, గుప్పెడు పచ్చగడ్డి వేసి ముడ్డి కింద తలగుడ్డ పెట్టుకొని కూచున్నాడు.

మంచెమీద యంకావ లేదు. బూర్లె మూట లేదు. మనసులో గుబులు గుబులుగా ఉంది. పెద్దగా అరుద్దామనుకొన్నాడు. భయం వల్లనో ఏమో మాట రాలేదు.

“సరేలే సూద్దాం... అనిపిచ్చింది నాకు” అన్నాడు సీరాములు.

చెంగులు ఎగదోపుకుని, చెప్పులు చేతబట్టుకొని, పొలంలో పడ్డాడు. నిలువున్నర ఎత్తున్న జొన్నచేను, మోకాళ్ళదాకా పొలంలో పెసరతీగా, దోసతీగా: ఫటుక్కున దోసకాయతెంపి, ఆవళంగా కొరికాడు. కటికచేదు-ఊసికాయను నేలకోసి బాదాడు.

“యంకావ కనిపియ్యలా”

భయం, అనుమానం, కోపం, ఆదురు, వీటికి తోడు, నూగుతగిలి కాళ్ళు చేతులు ముఖం దురదపెడుతున్నాయి.

కుంట మూలనించి కడియాలచప్పుడు వినిపించింది. ఆ చప్పుడు సీరాములు చెవులకు చాలా పరిచితమైంది. యంకావ కడియాల చప్పుడది.

అడ్డంపడి కలబందడొంక మాటుగా కుంట దగ్గర కొచ్చాడు.

యంకావ రేగిచెట్టు కానుకొని కాళ్ళారజాపి కూచున్నది. దాని వొళ్ళో పడుకొని సజ్జబూరెలు తింటున్నాడు సుబ్బిగాడు. అదేమో వాడికి పేలు చూస్తున్నది. వాడేమో ఏదో అంటున్నాడు. యంకావ మధ్య మధ్య నవ్వుతున్నదీ. మరీ నవ్వలేకపోయినప్పుడు పిడికిలి బిగించి వాడి వీపు మీద గుద్దుతున్నది.

“దాన్ని గొడ్డలి తీసుకునరకాలంటావా లేదో నువ్వే చెప్పు?” అన్నాడు సీరాములు. వాడి కళ్లు ఎర్రబడుతున్నాయి.

“ఏదోలేరా!” అన్నాడు ఆసామీ.

ఆమాట సీరాములుకు నచ్చలేదు. దూడ, ముట్టి నాకుతుంటే ‘దశేయ్’ అని అదిలించి, మట్టిబెడ్డ ముట్టిమీదకు గిరవాటెట్డాడు.

చేతిలో ఏం లేదు. మూగరాయి పెకలించి పైకెత్తి పట్టుకొని పులిలా గోండ్రుపెట్టాడు. సుబ్బిగాడు కుందేల్లా బెదిరి, కంచె దూకి పరుగెత్తాడు. యంకావ వొణుకుతో లేచి నిలబడింది. అసులుసులుగా ఉన్న కోక బిగించుకొంది. జుట్టు విదిలించుకొని ముడేసుకొంది. తల్లోంచి తంగేడుపూలు, రేకులురేకులుగా కిందికి రాలిపోయాయి.

సీరాములు మాట్లాడలేదు. మూగరాయిని ఎత్తి కుంటలో పారేశాడు. పిడికిలి బిగించి యంకావ డొక్కలో పొడిచాడు.

“ఇస్సు” అన్నది యంకావ మెల్లిగా. జుట్టుపట్టుకొని వొంచాడు. చర్మం చిట్లేలాగా గుద్దాడు. జుట్టు పీకాడు. జబ్బలు మెలితిప్పాడు. దవడమీద పొడిచాడు. మెడనరాలు చిట్లిపోయేలాగా మెలి తిప్పాడు. పది దంట్లు పీకి, పెసరతీగెతో కలిపి కట్టి, దంటుపిప్పిపిప్పి అయ్యేలాగా బాదాడు. వీపు మీదా, జబ్బలమీదా, తొడలమీదా చర్మం పగిలి, రక్తం కారుతున్నది. ఇక కొట్టలేక గడ్డిమీద బోర్లపడుకొని, భోరుమని ఏడిచాడు.

“బందేదో బందనుకోవే! పోనీ బుద్దిగా ఉండాలా వొద్దా? మల్లా మల్లా అదే యవారమా? వాడంటే పానాలిస్తదా? నామాటను తుడిసి పారేసుద్దా? ఇక నేను తాగకా, ఆ తిక్కలో దాన్ని తన్నకా సేసేదేందో సెప్పకరా” అన్నాడు సీరాములు.

తన్నినకొందికీ యంకావ గడుసుదేరిపోయింది. సందు దొరికితే సుబ్బిగాడి దగ్గరకు ఉడాయిస్తున్నదీ. సీరాములూ గుండెను రాయి చేసుకొన్నాడు. అమావాస్యకో పున్నానికో దాన్ని గిరేశాడు.

“ఇదే పనెట్టా?” అని తప్పుకుపోయేది యంకావ.

సీరాములు తన్నేవాడు. యంకావ లగ్గల కెత్తేది.

“ ఆ సచ్చినోడికి గాలి సోకింది. దయ్యం పూన్నప్పుడల్లా నానా అరాచకం మాటలూ అంటాడు. నేనేదో చేశానంటాడు. పురుగులు పడిసస్తాడు.”అంటుంది యంకావ.

“అడవిలో ఏవో చెట్లున్నాయట. ఆ చెట్లను తొక్కితే మతిస్థిరంగా ఉండదుట. పిచ్చిపిచ్చి మాటలన్నీ అంటారట.”

ఈ ప్రచారం ప్రారంభించింది యంకావ.

“అదుగందకే నేను తంతాను దాన్ని” అన్నాడు సీరాములు.

ఆసామీ అంతా విన్నాడు. విని కనిపించీ కనిపించకుండా నవ్వాడు.

“ఈరి యిసయం సూడ్రా”

జగన్నాథం మళ్ళీ మామూలు ప్రపంచంలోకి వొచ్చి పడ్డాడు.

“శరమం గిరమం వొలవలా, ఆడికే బయమేసి సచ్చానుగందా! ఎట్టెట్టనో బతికి బయటపడితినాయె” అన్నాడు సీరాములు.

ఇదే సమయమనుకొన్నాడు జగన్నాథం. అనుకొని గొంతు సరిచేసుకొన్నాడు.

“పోన్లెండి. నేనే అక్కడికి పోతాను. మీరా చిరతపులిని, అడవిలో చంపారా? పాడుపడిన యింట్లో చంపారా?”

“ఇంటికి అసంటా ఉన్న అడవిలో సంపినా” అన్నాడు సీరాములు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=2671**

* * *